సంపుటి: 1 | సంచిక: 2

జనవరి - ఫిబ్రవరి, 2013

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక



నీ దేవుడైన యెహోవా
నిన్ను విడువడు.
నిన్ను ఎడబాయడు.



# “మనస్సులోని మాట”

**క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.**

ప్రియమైన స్పర్శ పాఠకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. గత సంవత్సర కాలము మన జీవితములో దేవుడు ఎన్నో విధములుగా కాచి కాపాడడం జరిగింది. కృంగిన సమయములో ధైర్యపరిచి, ఇబ్బందికరమైన పరిస్థితులలో సహాయం చేసి మనలను ఈ నూతన సంవత్సరములో ప్రవేశపెట్టడం జరిగింది. ఈ సంవత్సరము దేవుడు మిమ్ములను, మీ కుటుంబములను దీవెనకరముగా ఉంచాలని నా ప్రార్థన.

గత సంవత్సరముల కంటే భిన్నంగా ఈ సంవత్సరము మనము ముందుకు వెళ్ళాలని ప్రార్థనా పూర్వకంగా సిద్ధపడదాం. అనగా గత సంవత్సరములలో జయించలేని బలహీనతల మీద జయం పొందుచూ దేవుని కొరకు జీవించుటలో శ్రద్ధ కలిగి ఉండెదము. ధనాపేక్ష కలిగియుండకుడి అని ప్రభువు మనకు ఇచ్చిన ఆజ్ఞ చాలా ప్రాముఖ్యమైనది. ధనవంతులగుటకు అపేక్ష గలవారు నానా విధములైన శోధనలలో చిక్కుకుంటారని 1 తిమోతి 6:9 ద్వారా ప్రభువు హెచ్చరించుచున్నాడు. మీరు ఏ ప్రాంతములలో ఉన్నవారైనా ధనాపేక్ష అనే శోధన విషయములో బహు జాగ్రత్త గలవారై ఉండవలయును అని ప్రేమతో బ్రతిమాలుకొనుచున్నాను. 2013వ సంవత్సరము స్పర్శ పాఠకులకు ధనాపేక్ష మీద జయం పొందే సంవత్సరముగా ఉండాలని ఆశిస్తున్నాను. ధనము మన అవసరముల కొరకు ఉపయోగించుకునే ఒక పనివానిగానే కాని మన జీవితమును నడిపించే యజమాని కాకూడదు.

అస్థిరమైన ధనము నందు నమ్మికయుంచక, సత్క్రియలు అనే ధనము సంపాదించుకొనుటకు సాగిపోవుదుము.

అట్టి ధన్యత దేవుడు  దయచేయును గాక !

మీ సహోదరుడు.....



సంపుటి: 1 | సంచిక: 2
జనవరి - ఫిబ్రవరి, 2013

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

## ఈ సంచికలో...


- నిన్ను....... 2
- కెయంబులో (కెన్యా) ఉజ్జీవం 5
- సోమరియైన స్త్రీ (స్త్రీల ప్రత్యేకం) 7
- సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 26వ భాగము 10
- పరమ శుంఠ (బాలల శీర్షిక) 12
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) 14
- ప్రేమించిన వారు ప్రమాదంలో ఉంటే 16
- ప్రార్థనా శక్తి 18
- ఆకోరు లోయ 20
- బైబిల్ క్విజ్-26 21
- ప్రార్థనా కూడికలు 22
- జన్మదిన శుభాకాంక్షలు 23


మా చిరునామా: ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం. 6, భాగ్యలత కాలని, వనస్థలిపురం,
హైదరాబాద్-500 070, ఫోన్: 040-2420 2227

# నిన్ను....

- బ్రదర్. ఎపప్రా

**"నీ దేవుడైన యెహోవా నిన్ను విడువడు, నిన్ను ఎడబాయడు" -ద్వితీ 31:8**

మోషే తన జీవితం ముగింపు సమయంలో యెహోషువతో ఇశ్రాయేలీయుల అందరియెదుట చెప్పుచున్న దేవుని వాగ్దానము. తరువాత దినములలో ఇదే విషయమును మన దేవుడైన యెహోవా స్వయంగా యెహోషువతో చెప్పడం జరిగింది. యెహోషువ 1:6. దేవునితో ముఖాముఖి మాట్లాడిన వ్యక్తిగా మోషే దేవుని ఉద్దేశం యెహోషువకు తెలియపరచుచూ ధైర్యపరచుచున్నాడు. నేడు ఇదే వాగ్దానము మనకు ఆదరణ కలిగించుచున్నది.

బైబిల్ గ్రంథములో ఉన్న ప్రతి వాక్యము దేవుని దగ్గర నుండి వచ్చినది అని మనము విశ్వసించవలెను. అయితే కొన్ని వాక్యములు చాలా ముఖ్యమైనవిగా మనకు ఎంతో ధైర్యమును కలిగించేవిగా ఉంటాయి. ఇది దేవుని చేత చెప్పబడిన మాట. ఆయన చెప్పిన మాట ఎన్నడూ వ్యర్థము కాదు. ఇచ్చిన మాటలను మనము మరచిపోవచ్చు కాని దేవుడు ఎన్నడు మరచిపోడు, చేసిన వాగ్దానమును నెరవేర్చక మానడు. ఆయన కేవలం మన పాపములను మాత్రమే మరచిపోతాడు కాని ఆయన చేసిన వాగ్దానములను ఎన్నడు మరచిపోడు. మనము అబద్ధికులము కాని ఆయన కాదు. **ప్రతి మనుష్యుడును అబద్ధికుడగును గాని దేవుడు సత్యవంతుడు కాక తీరడు - రోమా 3:4**

వాగ్దానముల విషయములో ఆయన ఎంత నమ్మదగినవాడో ఆలోచించుడి. వేల సంవత్సరముల క్రితము ఇశ్రాయేలీయులతో **విడువను, ఎడబాయను** అని చెప్పిన మాట నేటివరకు వారికి, వారి సంతానమునకు ఎంత దీవెనకరముగా ఉన్నదో మనము గమనించగలము. కనుక మన జీవితములలో దేవుని మాట పట్ల శ్రద్ధ కలిగి ఆయన చెప్పిన మాటను మనము విశ్వసించిన యెడల భూమి, ఆకాశములు గతించిన దేవుడు చేసిన వాగ్దానము గతించదని మనము ఎరుగవలెను. నిన్ను విడువను ఎడబాయను అని మనకు దేవుడు ఇచ్చిన వాగ్దానము విశ్వసించుట వలన మన జీవితములలో దాని నెరవేర్పు చూడగలము. దేవుడు ఇచ్చిన వాగ్దానమును విశ్వసించినవారు నడువవలసిన మార్గములను ధ్యానించకుందాము.

## 1. ధనాపేక్ష లేనివారిగా జీవించుట :

ధనము మనిషి జీవితంలో బాహ్య సంబంధమైన అవసరతలు తీర్చుటకు ఉపయోగపడవచ్చును కాని, ధనము మీద కలిగి ఉన్న అపేక్ష మానవ జీవితాన్ని నాశనం

చేయడం జరుగుతుంది. **ఒకని కలిమి విస్తరించుట అతని జీవముకు మూలము కాదు. - లూకా 12:15.** ఆకాను అనే వ్యక్తి ధనాపేక్ష వలన ఇశ్రాయేలీయులు హాయి అనే పట్టణము మీద జయము పొందలేకపోయిరి. తాను, తన కుటుంబముతోపాటు 36మంది తన ప్రజల మరణమునకు కారకుడయ్యాడు.

**ధనము యందు నమ్మిక యుంచువాడు దేవుని యందు నమ్మిక యుంచలేడు. ధనము హెచ్చినను దానిని లక్ష్యపెట్టకుడి** అని కీర్తనలు 62:10లో దావీదు హెచ్చరించుచున్నాడు. బైబిల్ గ్రంథములో గేహజీ అనే వ్యక్తి కూడా ధనమును ఆశించి తన పైన ఉన్న దైవజనుని మోసము చేసి కుష్ఠురోగమును బహుమతిగా పొందెను. ఇలాగు పరిశుద్ధ గ్రంథములో అనేకులు ధనాపేక్షకులై తమ జీవితములను నాశనం చేసుకోవడం జరిగింది. ఈ దినములలో క్రైస్తవులలో ఎంతో మంది ధనము విషయములో దేవుని ఉద్దేశములలో నుండి తప్పిపోవడం చూస్తున్నాము. ఒక విధముగా చూస్తే క్రీస్తును వెంబడించుటలో కూడ ధనసంబంధమైన ఆశీర్వాదముల కొరకే అన్నట్టుగా ప్రవర్తించుచున్నారు. ధనసంబంధమైన ఆశీర్వాదముల కొరకు క్రీస్తును వెంబడించువారు నిజమైన మారుమనస్సు కలిగినవారు కారు. నేటి క్రైస్తవ సంఘము ధనాపేక్ష విషయములో తప్పక ఒక మార్పు పొందవలసియున్నది. మనుష్యులు పాపము అని ఎంచని భయంకరమైన పాపము ధనాపేక్ష కనుక ఇలాంటి సున్నితమైన విషయములలో మనము సరియైన అవగాహన కలిగి దేవునిలో ముందుకు కొనసాగవలెను.

## 2. కలిగిన దానితో తృప్తి చెందుట :

తృప్తి కలిగియుండుట అనేది ఒక వ్యక్తి జీవితంలో కష్టతరమైన విషయం. ఎందుకంటే మనుష్యులకు ఎల్లప్పుడూ వేరొకరితో పోల్చుకొనుట, తాము కలిగి ఉన్నదానికంటే తమకు లేని దానిని గురించి చింతించుట అలవాటు. దేవుని విశ్వసించినవారిగా మన జీవితములలో దానికి భిన్నంగా ప్రవర్తించవలసిన అవసరం ఉంది. అందుకే అపొ.పౌలు ఫిలిప్పీ సంఘమునకు వ్రాసిన ఉత్తరములో **నేనేస్థితిలో ఉన్నను ఆ స్థితిలో సంతృప్తి కలిగియుండ నేర్చుకొని యున్నాను అని చెప్పుచున్నాడు, ఫిలిప్పీ 4:11,12.** సంతృప్తి కలిగియున్న చోట సంతోషము ఉంటుంది. సంతోషము ఉన్న వ్యక్తి జీవితం ఎప్పుడూ అనేకులకు ఆశీర్వాదకరంగా ఉంటుంది.

ఎలాంటి పరిస్థితులలోనైనా ఆయన నిన్ను విడువడు అని వాగ్దానము చేసియున్నాడు. కాబట్టి దేవుడు నన్ను ఉంచిన స్థితిలో ఎల్లప్పుడూ సంతృప్తి కలిగి ఉంటానని తీర్మానం చేసుకొనవలెను. ఈ లోకంలోనికి ఏమియు తేలేదు, ఏమియు తీసుకొనిపోలేము.

కాబట్టి అన్నవస్త్రములు కలవారమై తృప్తి కలిగి ఉండవలెను అని దేవుడు మనకు నేర్పించుచున్నాడు. తృప్తి కలిగి జీవించడం మనం మన పిల్లలకు నేర్పించడం ద్వారా మన కుటుంబములలో పరలోక సంతోషమును అనుభవించగలము. నేను వ్యక్తిగతంగా, దేవుని పరిచర్యలో అనుభవిస్తున్న సమాధాన, సంతోషములకు కారణం సంతృప్తి కలిగి ఉండటం అని తలంచుచున్నాను. అట్టి సమాధాన, సంతోషములు దీనిని చదువుచున్న మీరును కలిగి జీవించాలని నా హృదయాభిలాషయైయున్నది. ప్రపంచములో ఉన్న మనుష్యులందరిలో నిజమైన సంతోషము కలిగిన వారిని మనం చూడాలని ప్రయత్నిస్తే ఖచ్చితంగా సంతృప్తి కలిగిన వారే అయి ఉంటారు.

### 3. ధైర్యము కలిగి జీవించుట :

క్రీస్తును ఎరిగిన మనము ఎన్నడూ భయముతో జీవించకూడదు. **ఆయన నిన్ను విడువడు, నిన్ను ఎడబాయడు** అనే మాట మనము ధైర్యముగా జీవించుటను ప్రేరేపించుచున్నది. బైబిల్ గ్రంథములో ఆదికాండము నుండి ప్రకటన గ్రంథము వరకు అనేకసార్లు వ్రాయబడిన మాటలలో ఒకమాట భయపడవద్దు అనగా ధైర్యము కలిగి ఉండు అని. పాత నిబంధనలో ప్రవక్తల ద్వారా తన ప్రజలను ధైర్యపరచిన దేవుడు, నూతన నిబంధనలో ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా మనలను బలపరచినాడు. అందుకే **ఇదుగో నేను యుగసమాప్తి వరకు సదాకాలము మీతో కూడా ఉన్నానని మత్తయి 28:20లో** చెప్పడం జరిగింది. కొంచెం లోతుగా ఆలోచిస్తే విడువను, ఎడబాయను అన్న మాట ఒక్కటి చాలు మన జీవిత కాలమంతా నిశ్చింతగా బ్రతకడానికి. ప్రధానమంత్రో లేక ముఖ్యమంత్రో మనకు ఏదైనా మాట ఇస్తే ఎంతో ధైర్యముగా ఉంటాము. సర్వసృష్టి మీద సర్వాధికారము కలిగియున్న దేవుడు చెప్పిన మాటను మరి ఎంతగా మనము నమ్మవలయునో కదా! నేటివరకు అనేకులు ఆయన మాటను బట్టి కలిగిన ధైర్యముతో తమ్ముని తాము, తమకు కలిగినవాటన్నింటిని వ్యయపరచు చున్నారు అని మనము గుర్తించాలి.

కాబట్టి ప్రియమైన స్పర్శ పాఠకులు గమనించవలసినది ఏమనగా నిన్ను విడువను, నిన్ను ఎడబాయను అని 2013వ సంవత్సరములో దేవుడు మనకిచ్చిన వాగ్దానము మనకు మన కుటుంబములకు దీవెనకరంగా ఉండాలని, ఈ వాగ్దానం బట్టి ధనాపేక్ష విడిచి, సంతృప్తి కరమైన జీవితంతో, బహుధైర్యము గలవారమై జీవించులాగున ప్రభువు కృప చూపించాలని నా ప్రార్థన. అట్టి ధన్యతను దేవుడు మీకు అనుగ్రహించును గాక !

# కెయంబులో (కెన్యా) ఉజ్జీవం

కెయంబు పట్టణం హింసకు, మానభంగాలకు, హత్యలకు ప్రసిద్ధి. ఈ పట్టణం అభివృద్ధి చెందడం లేదు. అదే విధంగా సంఘాలు కూడా పెరగడం లేదు. పట్టణానికున్న చెడ్డ పేరు వలన ఎవరు కూడ ఆస్థులను కొనడం లేదు. 1980 చివరికల్లా నైరోబి అనే శివారు ప్రాంతం కెన్యాలోనే అణిచేసే అతి ప్రమాదకరమైన పట్టణంగా మారింది. అక్కడ బార్‌షాపులు సంఘాలు, కిరాణ దుకాణాల సంఖ్యను మించిపోయాయి. మత్తు పానీయాలతో నిండిన కెయంబు పట్టణం దేశంలోనే గొప్ప నేరస్థుల పట్టణంగా మారింది. మానభంగం చేయబడతామనే భయంతో స్త్రీలు రాత్రిపూట బయటికి వెళ్ళడానికి సాహసించే వారు కాదు. కెయంబులో ఇవ్వబడిన పనిని తప్పించుకోవడానికి పట్టణ అధికారులు లంచాలను ఇచ్చేవారు. 65000 మంది జనాభా గల ఈ పట్టణంలో సంఘాలు కొన్ని డజన్లకు మించి పెరగలేకపోతున్నాయి.

1988 సంవత్సరంలో కెయంబు పట్టణానికి వెళ్ళమని దేవుడు థామస్ ముత్తేతో, అతని భార్యతో మాట్లాడాడు. స్మశానం వంటి ఈ చెడ్డ పట్టణంలో సంఘ స్థాపన చేయడం అంత సులువేం కాదని వారికి తెలుసు. ఆ పట్టణానికి వెళ్ళాలనే ఆలోచన పిచ్చిదని అతని తోటి సేవకులు భావించారు కాని వారు దాన్ని అతనితో చెప్పడానికి సందేహించారు. కెయంబు పట్టణంలో అణిచివేతకు వెనక ఉన్న మూల కారణాన్ని గుర్తించాలని ఆ దంపతులు భావించారు. వారి పోరాటం రక్తమాంసాలకు విరోధంగా కాదు గాని ఆకాశ మండలంలో ఉన్న దురాత్మ శక్తులకు, ప్రధానులకు విరోధంగా అని వారు దృఢంగా నమ్మారు.

ఆరు మాసాల పాటు వారు తీవ్రమైన ప్రార్థనకు, అధ్యయనానికి తమను తాము సమర్పించుకొన్నారు. వారు ఉపవాస ప్రార్థన ద్వారా కూడా దేవుని సన్నిధిని వెదికారు. ఆ పట్టణంలోని ఆత్మీయ శక్తులు కూలిపోయాయనే నిశ్చయతను దేవుడు వారికిచ్చాడు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బహిరంగ సమావేశాన్ని ఏర్పాటు చేశాడు. మొదటి వారంలో 200 కంటె ఎక్కువ మంది ప్రజలు తమ జీవితాన్ని క్రీస్తుకు సమర్పించారు. అనతి కాలంలోనే స్వస్థత, మారుమనస్సు సర్వ సాధారణమైనాయి. మున్సిపల్ హాల్ సమావేశానికి సరిపోనప్పుడు థామస్ కిరాణ దుకాణం క్రిందున్న బేస్‌మెంట్‌కు వచ్చాడు. ప్రతి గంట విజ్ఞాపనలతో ఉంది గనుక దానికి 'ప్రార్థన గుహ' అని పేరు వచ్చింది.

ఒకసారి ప్రార్థనలకు స్పందనగా మంత్రాలు చేసే స్త్రీ ఆ పట్టణాన్ని వదిలి వెళ్ళిపోయింది. పట్టణ వాతావరణం మారడం మొదలైంది. రాత్రి పూట బయటకు వెళ్ళాలంటే ఒకప్పుడు భయపడిన ప్రజలు ఇప్పుడు రాత్రి వేళ బయటికి యదేచ్ఛగా

వెళ్తున్నారు. ఇప్పుడు కెయంబు పట్టణం దేశంలోనే అతి తక్కువ నేరాల శాతం గల పట్టణంగా మారింది. స్థానిక బారు షాపులు మూతపడి అవి సంఘాలుగా మారాయి. పట్టణం కూడా అనేక రీతులుగా అభివృద్ధి చెందడం మొదలైంది. చుట్టు ప్రక్కల పట్టణాల నుండి ప్రజలు వస్తున్నారు గనుక పట్టణ జనాభా 30 శాతానికి పెరిగింది. 30 నుండి 40 మంది విశ్వాసుల హాజరు మాత్రమే ఉండే పట్టణంలో ఇప్పుడు 'ప్రార్థన గుహలో' సంఖ్య 5000కి పెరిగింది. నేరస్థులు, వ్యభిచారులు రక్షించబడ్డారు.

ప్రతిరోజు 400 కంటే ఎక్కువ మంది విజ్ఞాపనకర్తలు ప్రార్థనకు కూడుకునేవారు. ప్రార్థన కార్యక్రమం ఉదయం 6 గంటల నుండి మొదలవుతుంది. దాన్ని వారు 'ఉదయం మహిమ' అని పిలిచేవాళ్ళు. ఇది వారి బుధవారం, శుక్రవారం కార్యక్రమాలకు వేరుగా జరిగే ప్రార్థన.

కెయంబు పట్టణంలో దేవుడేమి చేశాడో మీరు నమ్మగలరా? ఆయన అదే కార్యాన్ని లోకంలో మరే చోటనైనా చేయగలడు. ఆయన గొప్ప ఆశ్చర్య కార్యములను చేయాలని ఆశిస్తున్నాడు కాని దేవుని కృపాసనం వద్ద ప్రార్థన, ఉపవాసాల్లో తమ హృదయాలను కుమ్మరించే మూల్యాన్ని చెల్లించే వారి కోసం ఆయన చూస్తున్నాడు. దేవుడు నిన్ను అలాంటి వ్యక్తిగా కనుక్కొంటాడా?


## ఉపవాస ప్రార్థన

**ఉపవాస ప్రార్థన - 2013, జనవరి 26వ తేది (శనివారం)**
ఉదయం 9 గం.ల నుండి సాయంత్రం 4 గం.ల వరకు జరుగును.
ఆసక్తి కలిగినవారు మాత్రమే పాల్గొనవలసినదిగా మా విన్నపం.

**వివరములకు:**
9666666249 | 040-24202227

# సోమరియైన స్త్రీ

- సిస్టర్ వి.విజయ

అబ్బా! అప్పుడే తెల్లారిపోయిందా? ఇక లేవాలా? తప్పదు, లేవాలి అన్నట్లుగా బద్ధకంగా లేచి నూతనదినం ప్రారంభిస్తే ఎలా సంతోషంగా ఉండగలము. సోమరితనము గాఢనిద్రలో పడవేస్తుంది. **ఇక కొంచెము నిద్రించెదనని కొంచెము కునికెదనని కొంచెము సేపు చేతులు ముడుచుకొని పరుండెదనని నీవనుచుందువు అని సామెతలు 6:10** లో వ్రాయబడియున్నది.



మనుష్యులతో పోలిస్తే ఎలాంటి ప్రాధాన్యత లేని చీమకు కూడా సోమరి కంటే ఎక్కువ బుద్ధి ఉన్నది అని మహా జ్ఞాని సామెతల గ్రంథములో చెప్పుచున్నాడు. **సోమరీ, చీమల యొద్దకు వెళ్ళుము వాటి నడతలు కనిపెట్టి జ్ఞానము తెచ్చుకొనుము వాటికి న్యాయాధిపతి లేకున్నను పై విచారణ కర్త లేకున్నను అధిపతి లేకున్నను అవి వేసవి కాలమందు ఆహారము సిద్ధపరచుకొనును కోతకాలమందు ధాన్యము కూర్చుకొనును - సామె 6:6,8**

చీమలు ఎంతో జ్ఞానముతో వాటి నడవడిక విషయమై జాగ్రత్త కలిగి ఉంటున్నాయి అని మనకు అర్ధమగుచ్నుది. వాటికి పైన అధికారి లేడు. విచారణ చేయడానికి విచారణ కర్త లేడు, ప్రశ్నించడానికి న్యాయాధిపతి లేడు. అయిననూ వాటి బాధ్యతల విషయమై ఎంతో జ్ఞానముతో ప్రవర్తించుచున్నాయి. మన పైన దేవుడు, కుటుంబస్తులు ఉన్నారు, అయినా కొందరు బాధ్యత లేని వారిగా ఉంటున్నారు. బాధ్యతగా ఉండుట మనుష్యుల యొక్క కనీస ధర్మం.

గుణవతియైన భార్య **"చీకటితోనే లేచి తన ఇంటి వారి కొరకు భోజనమును సిద్ధపరచును"** అని లేఖనములలో చెప్పబడింది. ఉదయమునే లేచి భర్తకి, పిల్లలకి భోజనము సిద్ధపరిచే విషయము నేటి దినములలో ఎంతో కష్టంగా భావిస్తున్నారు. నేను ఉదయాన్నే లేవలేను, నాకు అలవాటు లేదు అని చెప్పే స్త్రీలు ఎంతో మంది ఉన్నారు.

కొంత మంది తల్లులు యౌవ్వనులైన పిల్లలను, మా అమ్మాయికి ప్రొద్దునే లేవడం అలవాటు లేదు, పనులేవీ రావు అని సమర్థిస్తూ ఉంటారు. తల్లులు ఆలాగున ఎన్నడూ సమర్ధించకూడదు. చెడ్డ అలవాట్లను ఖండించి, బాధ్యతలను నేర్పించి, తోటి వారితో స్నేహ

భావంతో మెలగడాన్ని ప్రోత్సహించాలి. అప్పుడు వారి జీవితములలో ఎక్కడికి వెళ్ళినను అనేకులకు ఆశీర్వాదకరముగా ఉంటూ, మంచిపేరును తెచ్చి పెడతారు.

సోమరితనము సమయము యొక్క విలువను గ్రహించకుండా చేస్తుంది. చేయవలసిన పనులు సమయమునకు చేయకుండా వాయిదా వేయడం సోమరితనమునకు ఎంతో ఇష్టం. వ్యర్థమైన సంభాషణలతో, ముసలమ్మ ముచ్చట్లతో సమయమంతా వ్యర్థము చేస్తూ ఆర్థికంగానూ, ఆత్మీయంగానూ నష్టపోతున్నవారు ఎందరో! ఆదాము, హవ్వలను దేవుడు ఏదేను తోటలో ఉంచి, ఒక్క వృక్ష ఫలములను తినవద్దు అని చెబితే, ఆ మాటని సాతాను అవకాశంగా తీసుకొని, హవ్వతో మాట్లాడుతుంటే, హవ్వ ఆ మాటలలో మునిగిపోయి, వ్యర్థమైన ఆలోచనలలోకి వెళ్ళి, దేవుని ఆజ్ఞను అతిక్రమించింది. మనము సోమరితనంతో లేకుండా ఉంటే వ్యర్థమైన మాటలకు అవకాశం ఉండదు. అనవసరమైన ఆలోచనలకు కేంద్రబిందువుగా మన హృదయం ఉండదు.

సోమరితనము హృదయములలోని మంచి అలోచనలు అనే పూతని పాడుచేయు ఒక గుంటనక్క వంటిది. క్రొత్త నిబంధనా గ్రంథములోని ఒక యజమానుడు దేశాంతరము పోవుచూ, తన దాసులైన వారిలో ఒక్కొక్కరిని పిలిచి ఒకనికి ఐదు, మరియెకనికి రెండు, ఇంకొకనికి ఒక్క తలాంతును ఇచ్చెను. యజమానుడు తిరిగి వచ్చినప్పుడు ఐదు తలాంతులు తీసుకున్న వ్యక్తి మరి ఐదు తలాంతులు, రెండు ఉన్న వ్యక్తి మరి రెండు, సంపాదించి అతనికి అప్పగించారు. మరి ఒక్క తలాంతు తీసుకొన్న వ్యక్తి ఏమీ సంపాదించలేదు. అతను కష్టపడి పనిచేయడానికి ఇష్టపడక, యజమాని ఇచ్చిన దానిని భూమిలో దాచి, తిరిగి అప్పగించాడు. అందుచేత యజమాని చేత "సోమరివైన చెడ్డ దాసుడా" అని పిలిపించుకున్నాడు.

**"చురుకుగా నుండుట గొప్ప భాగ్యము" - సామె 12:27**

నాబాలు, భార్యయైన అబీగయీలు అనే స్త్రీని మనము బైబిల్ గ్రంథంలో చూస్తాము. ఆమె ఎంత చురుకుతనము కలిగినదో 1వ సమూయేలు గ్రంథంలో వ్రాయబడియున్నది. దావీదు, అతని సేవకుల కొరకు త్వరపడి, సిద్ధపరిచిన ఆహారమును తీసుకొని వెళ్ళి, తనని తాను తగ్గించుకొని ఆమె కనపరిచిన సుబుద్ధి వలన ఆశీర్వదించబడిన స్త్రీగా చరిత్రలో నిలచియున్నది.

క్రొత్త నిబంధనా గ్రంథములో కొందరు స్త్రీలు ఆదివారము తెల్లవారుచుండగా, యేసుప్రభువు దేహమునకు సుగంధద్రవ్యములు పూయవలెనని సిద్ధపరచుకొని వెళ్ళిరి. వారు ఎంత వేకువనే లేచి, ఇళ్ళలో పనులు చేసుకొని, వాటిని సిద్ధపరుచుకొని వెళ్ళారో మనం అర్థం చేసుకుంటే వారికి ఉన్న తపన ఎంతో గ్రహించగలం.

ఒక స్త్రీ వేకువనే లేచి దేవుని సన్నిధిలో ఆ దినమును దేవునికి అప్పగించి, కృతజ్ఞతాస్తుతులు చెల్లించి, తన పనులను లేక బాధ్యతలను మొదలుపెడితే, ప్రతి దినమూ, ప్రతి సంవత్సరము ఆనందమయమే.

యేసయ్య సమాధి యొద్దకు చురుకుగా వెళ్ళిన ఆ స్త్రీలకు ఆయన పునరుత్థానమును గూర్చి మొదటిగా లోకమునకు, ఆయన శిష్యులకు చెప్పే గొప్ప ధన్యతను దేవుడు అనుగ్రహించారు.

కనుక ప్రియ సహోదరీ! కుటుంబములో స్త్రీగా ఉంటున్న నీకు దేవుడు కొన్ని బాధ్యతలను, తలాంతులను అప్పగించాడు. ఆయన ప్రశ్నించబోవు దినమున నీ సమాధానం ఏమైయున్నది? సోమరితనము విడిచి, బాధ్యతలను నమ్మకంగా నెరవేర్చి దేవుని చేత భళా! నమ్మకమైన మంచి దాసురాలా అని పిలిపించుకొనే వారిగా ఉండాలి. ఈ సంవత్సరమంతా దేవుడు అట్టి చురుకైన వారిగా మనలను చేయును గాక !

మీ అందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు.

## ముఖ్య గమనిక:

మీ ప్రార్థనావసనతలకై **ఎపఫ్రా మినిస్ట్రీస్** ఆఫీసు నందు
సోమవారం నుండి శనివారం వరకు
ఉదయం 10.30 గం॥ల నుండి సాయంత్రం 6.30 గం॥ల
వరకు సంప్రదించగలరు.

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com

**ఎపఫ్రా మినిస్ట్రీస్ పాటలు మరియు ప్రసంగముల సి.డి.లు కావలసినవారు మమ్ములను సంప్రదించగలరు.**



# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర

– సీరియల్ 26వ భాగము

1912లో తన సువార్తయాత్రలోకదానిలో కర్తార్‌సింగ్‌ను గూర్చి విన్నాడు సుందర్. అతని వృత్తాంతం సుందర్‌ని కదిలించి వేసింది. పూ పట్టణమును వదిలి ఆయా మార్గములలో వెళ్ళుచూ వాక్యమును ప్రకటించాడు. మార్గములో ఎంతగానో పూజలందుకునే ఓ లామా ఆశ్రమానికి వచ్చాడు. క్రీస్తు జీవిత చరిత్ర గల గ్రంథాలేమైనా మీ గ్రంథాలయములో ఉన్నాయా అని అడిగాడు. ఎన్నో సంవత్సరముల క్రితం టిబెట్‌లోని బౌద్ధమత గ్రంథాలయము నుండి నోట్‌విక్ అనే రష్యా దేశీయుడు అలాంటి ఒక గ్రంథమును తీసుకున్నాడని యేసుక్రీస్తు టిబెట్‌కు వచ్చినట్లుగా దానిలో ఉన్నట్లు తాను విన్నానని సుందర్ వివరించనారంభించాడు. అలా కానే కాదని ఆ లామా జవాబిచ్చాడు. అలాంటి గ్రంథమేమియయు తన గ్రంథాలయాల్లో లేదని చెప్పాడు. అయితే అనేక సంవత్సరముల క్రితం క్రైస్తవులు వచ్చి తమ రాజుకు సువార్తని అందించగా అతడు క్రైస్తవుడైనాడనేది వాస్తవమని అతని తరువాత వచ్చిన రాజు టిబెట్‌లో క్రైస్తవ్యమును రూపు మాపాడని, అప్పటి నుండి ఇచట క్రైస్తవ మతమును ప్రకటించడానికి అనుమతి లేకుండ చేశారని ఆ లామా చెప్పాడు. ఆ లామాతో జరిగిన సంభాషణ వివరములను ఇంతకు మించి తెలియజేయలేదు. కాని ఒకచోట నుండి వేరొక చోటుకు వెళ్తూ వాక్యమును ప్రకటించినప్పుడు నిర్దిష్టమైన తీర్మానముతో వారు సువార్తను ఎదిరించడాన్ని, తనను బెదిరించడాన్ని గమనించాడు. ఇక్కడ నుండి నీవు వెళ్ళిపోలేదంటే కర్తార్‌సింగ్‌కు పట్టిన గతే నీకు పడుతుందని చెప్పారు.

మాటిమాటికి కర్తార్‌సింగ్ అనే మాట వినబడడంతో అతనిని గూర్చి తెలిసికోవాలన్న ఉత్సుకత సుందర్‌లో అధికమై పోయింది. టిబెట్ దేశస్తుల ద్వారానే గాక ఇతరుల ద్వారా కూడా కర్తార్‌ను గూర్చి తెలుసుకున్నాడు. కర్తార్‌సింగ్ కూడా సుందర్ లాగా పాటియాలా ప్రాంతం వాడే. క్రైస్తవుడవ్వాలని అతడు నిర్ణయించుకొన్నాడని తెలిసికొన్న తండ్రి సుందర్ తండ్రి కంటే మరింత తీవ్రంగా ప్రతిస్పందించాడు. బట్టలన్నీ విప్పి కాళ్ళ దగ్గర పడవేసి వెళ్ళిపోయాడు. మరల ఇంటి ముఖం చూడవద్దని హెచ్చరించాడు. కర్తార్ వెళ్ళిపోయి రెండు మూడు దినములు ఒంటరిగా అడవిలో దిగంబరిగానే యుండినాడు.

అయితే సుందర్ వలెనే హృదయములో ఎంతో ప్రశాంతతను అనుభవించాడు. ఆ తరువాత ఏదో కొంత కాయకష్టం చేసి బట్టలు కొనుక్కొని సువార్త ప్రకటించడానికి సాధులాగానే వెళ్ళాడు. దారిలో బాప్తిస్మం తీసుకొని టిబెట్ భాషను శ్రద్ధగా నేర్చుకొని టిబెట్‌కు తరలిపోయాడు. ఆ తరువాత తాషిగాంగ్ పట్టణమును చేరేంతవరకు మార్గములో సువార్తను ప్రకటించాడు. తాషిగాంగ్‌లో మూడు నెలలు ఉండి చెవి యొగ్గిన వారికందరికి సువార్త ప్రకటించాడు. అయితే అప్పటి నుండి క్రమేపి వ్యతిరేకత ఎక్కువ కావడం ప్రారంభమయ్యింది. ఒకానొక సందర్భములో పట్టణములో నుండి అతనిని బలవంతంగా బయటకు నెట్టివేశారు. యేసుప్రభువును గూర్చిన సత్యమును వారికి అందించడానికి వారి నిత్య రక్షణ కోసం ఆయన చేసిన కార్యమును వారికి ప్రకటించడానికై మరణాన్నెదుర్కోడానికైనా అతడు సంసిద్ధుడైనాడు. మీరు నన్నేమి చేసినా సువార్త నందించకుండ ఈ పట్టణాన్ని విడిచి పోయేది లేదని మరల పట్టణములో ప్రవేశించాడు.

తరువాత వారు అతన్ని పట్టుకొని ప్రధాన లామా దగ్గరకు ఆయనను తీసుకొని పోగా అతడు కర్తార్‌కి శిక్ష విధించాడు. కర్తార్‌ని కొండ మీదికి తీసుకొని పోయి యాక్ చర్మములో కుట్టి ఎండలో పడవేయండని ఆజ్ఞాపించాడు. ఆ కొండ మీదికి కర్తార్‌ను తీసుకొని పోవుచుండినపుడు నేను మరల క్రిందికి రాను గాని నా ప్రభువుతో కూడ నుండడానికై పరలోకం పోవడానికి తిరిగి లేస్తానని చెప్పాడు వారు అతనిని తీసుకొనిపోయి యాక్ చర్మములో కుట్టి విడిచి పెట్టి వెళ్ళిపోయారు గాని దీనికి అతడు ఎలా స్పందిస్తాడో చూడాలని మాటి మాటికి పైకి వచ్చి చూస్తుండేవారు. వారు అలా వచ్చిన ప్రతిసారి కర్తార్ పాటలు పాడుచు, ప్రార్థించడం చూచి యేమి చేయాలో తోచక ఆశ్చర్యపడిపోయారు. మరి కొందరైతే ఏదో దేవతల ఆత్మ అతనిలో వుందని చెప్పారు. ఇలా మూడు దినములు గడిచిన తరువాత తన శత్రువులను క్షమించమని తన ఆత్మను చేర్చుకోమని ప్రార్థిస్తూ కర్తార్ చనిపోయాడు.

కర్తార్ కథను చెప్పిన ప్రతిసారి సుందర్ ముఖము వెలిగిపోతుండేది. కర్తార్ మరణముతోనే అంతా అయిపోలేదు. ఒకానొక దినమున పాటియాలా స్టేషన్‌లో సమకూడిన జనసందోహమునకు కర్తార్ కథను వివరిస్తూ ఉండగా దూరంగా నిలిచి వినుచున్న ఓ వృద్ధుడు ఏడ్వడాన్ని సుందర్ చూచాడు. అతనితో మాట్లాడిన తరువాత అతడే కర్తార్ తండ్రి అని తెలిసింది. అతని దగ్గరకు వెళ్ళి ఎంతో ఆప్యాయంగా మాట్లాడాడు. తత్ఫలితంగా అతడు క్రైస్తవుడైనాడు గాని తాను క్రైస్తవుడనని బాహాటంగా చెప్పే ధైర్యం లేకపోయింది.

– సేకరించబడినది. –(ఇంకా వుంది)



# “పరమ శుంఠ”

Happy New Year. బావున్నారా? పిల్లలూ ఏంటి విశేషాలు? New Yearలో ఏమేమి Plans వేస్తున్నారు? ఒక గురి కలిగి జీవించాలని నా Advice. మీరు మీ Studiesలో ఏ Goals పెట్టుకున్నా, Career బావుండాలని నా ఆశ. ఏది ఏమైనా ఈ New Yearలో ఒక మంచి తీర్మానం కలిగి జీవించాలని ఈ Story మీ కొరకు వ్రాస్తున్నాను.

రత్నపురి రాజ్య ఆస్థాన పండితుడు వరదాచారి. ఈయన ఎంతటి వారినైనా తన వాగ్ధాటితో చిత్తు చేసేవాడు. ఎంత గొప్ప పండితుడినైనా తన అమోఘ పాండిత్యంతో అవలీలగా ఓడించేవాడు. దాంతో ఆయన కీర్తి నలుదిక్కులా మారుమోగిపోసాగింది.

వరదాచారి కుమారుడు సుబుద్ధి. అతడికి చదువు మీద ఆసక్తిలేదు. ‘చదువే బంగారు భవిష్యత్తుకు పునాది’ అని ఎవరైనా హితవు పలికితే అతడికి తగని చిరాకు. ‘కష్టపడి చదవవలసిన అవసరం నాకు లేదు. చదువు లేకున్నా నేను హాయిగా, దర్జాగా బతకగలను. మా నాన్న గొప్ప పండితుడు. మా ఇంటి నిండా బంగారు నాణాలు, రత్న మాణిక్యాలు ఉన్నాయి అని గొప్పగా చెప్పేవాడు. రోజూ ఆటపాటలతో సమయం వృథా చేసేవాడు. అది గమనించిన ఓ వ్యక్తి ‘పండిత పుత్ర పరమశుంఠ’ అన్నాడు. ఆ మాటలు విన్న సుబుద్ధి పండితుడి పుత్రుణ్ని పరమశుంఠ అని గౌరవంగా పిలుస్తారని భావించి, ఎంతో పొంగిపోయాడు.

ఒకరోజు సుబుద్ధి రాజుగారి ఉద్యానవనంలో ఆడుకుంటున్నాడు. అంతలో అటుగా వెళుతున్న మంత్రి, “ఎవరు బాబూ నీవు” ? అని ప్రశ్నించాడు. “నేను పండిత వరదాచారి పుత్రుడిని. పరమశుంఠను అని గర్వంగా చెప్పాడు సుబుద్ధి.

అంతలో ఏదో శబ్దం వినిపిస్తే ఇద్దరూ అటువైపు చూశారు. అక్కడ ఓ చెట్టుపై కొన్ని కోతులు ఉన్నాయి. అవి ఒక కొమ్మ మీద నుంచి మరో కొమ్మ మీదకు దూకుతున్నాయి. అంతలో ఓ కోతి పట్టుతప్పి కిందపడింది. వెంటనే మిగిలిన కోతులు దానిని వదిలివేసి, అక్కడ నుండి వెళ్లిపోయాయి.

సుబుద్ధి బాధపడుతూ, "ఆ కోతులు కిందపడిన కోతిపై ఎందుకు జాలిచూపలేదు?" అని అడిగాడు. అందుకు మంత్రి, "బాబూ! కోతి జాతిలో ఓ పద్ధతి ఉంది. కోతులు ఒక కొమ్మ మీద నుంచి మరో కొమ్మ మీదకు దూకేటప్పుడు కిందపడవు. ఏ కోతైనా పొరపాటున కిందపడితే, అది తమ జాతికి అవమానంగా కోతులు భావిస్తాయి. అందుకే ఆ కోతిపై జాలిచూపక దాన్ని వదిలివేసి వెళ్లిపోతాయి. ఎందుకో తెలుసా? కోతులు దేన్నైనా సహిస్తాయి కాని, చేతకానితనాన్ని మాత్రం సహించలేవు" అని చెప్పాడు.

అది విన్న సుబుద్ధి "అయితే పండితుల పిల్లలంతా బాగా చదువుకుంటున్నారు. కానీ చదువురాని నేను వాళ్లందరి ముందూ చేతకాని వాడిని అవుతాను కదా! మరి అందరూ నన్ను వదిలివేస్తారా? అని ఉద్వేగంతో అడిగాడు. మంత్రి అతడి భుజంపై చెయ్యేసి, "అవును నాయనా, నీవు చదువుకోకుంటే అందరూ నిన్ను పండిత పుత్ర పరమశుంఠ" అంటారు. పరమశుంఠ అంటే తెలివి తక్కువవాడు అని అర్థం అన్నాడు.

సుబుద్ధి కాసేపు ఆలోచించుకుని, "నేను బాగా చదువుకుని గొప్ప పండితుడిని అవుతాను. తండ్రిని మించిన కొడుకు అన్న పేరు తెచ్చుకుంటాను అన్నాడు. మంత్రి అతడిని మనసారా ఆశీర్వదించాడు. అప్పటి నుండీ సమయాన్ని వృథా చేయక శ్రద్ధగా చదువుకోవడం ప్రారంభించాడు. అప్పటి వరకూ అతనిని ఎగతాళి చేసినవారు నోటిమీద వేలేసుకున్నారు. సుబుద్ధి గొప్ప పండితుడు అయ్యాడు.

తెలిసీ తెలియక ఏదో ఒక భ్రమలో జీవిస్తూ, చదువుకోవలసిన సమయమును మీలో ఎవరైనా పాడు చేసుకుంటున్నారేమో చెక్ చేసుకోండి. తన తండ్రి పండితుడు అనే అహం అతనిని ఒక శుంఠలాగా మార్చింది. అర్థమయ్యిందా?

అయితే చివరకు సుబుద్ధి ఒక మంచి తీర్మానం చేసుకొని ఒక గోల్ పెట్టుకున్నాడు. మీరు కూడా మీ తల్లిదండ్రులకు చెడ్డపేరు తేకుండా మీ స్టడీస్‌లో ముందుకు వెళ్లాలని నా ఆకాంక్ష. ఈ ఇయర్ అంతా స్టడీస్‌లో దేవుడు విడువక, ఎడబాయక తోడైయుండును గాక!

# "నా జీవితములో దేవుని మేలులు"

సి. హెచ్. ఆమోసు - నంధ్యాల

ప్రభువైన యేసుక్రీస్తు నామములో అందరికి నా వందనములు. నా పేరు చిలుకూరి వెంకటేశ్వరరావు (ఆమోసు). మాది పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు దగ్గర నడిపూడి. మా తల్లిదండ్రులు హైందవ సంప్రదాయంతో విగ్రహారాధన చేయుటయందు బహు నిష్ట కలిగి జీవించెడి వారు. ఆర్థికంగా సమృద్ధి కలిగి జీవిస్తున్న మా కుటుంబంలో నా తల్లికి కలిగిన అనారోగ్యమును బట్టి హాస్పటల్‌లో జాయిన్ చేయడం జరిగింది. డాక్టర్స్ ప్రాణాపాయం అని చెప్పారు. రోగుల కొరకు ప్రార్థన చేయడానికి వచ్చే దైవసేవకులు చెప్పే మాటల యందు మా అమ్మగారు విశ్వాసమును ఉంచి, ప్రార్థించుకొనుట ద్వారా మరణము నుండి తప్పించబడ్డారు. అప్పటి నుండి యేసుని యందు నమ్మిక ఉన్ననూ మాకు అంతకు ముందు ఉన్న ఆచారములు, కట్టుబాట్లను బట్టి నామకార్థంగా జీవించుచున్న సమయములో మా తండ్రిగారు చనిపోయారు. అప్పుడు నేను 8వ తరగతి చదువుచున్నాను. మా తండ్రిగారు చనిపోయే సమయమునకు ఆయనకి ఉన్న చెడు వ్యసనములను బట్టి మాకు ఉన్న ఆస్థి అంతయు హరించిపోయిన కారణంగా నేను చదువు మానివేయవలసిన పరిస్థితి వచ్చినది. మా బంధువులు ఎవరూ మాకు సహాయపడేవారు కాదు.

ఆ సమయములో మమ్ములను నంధ్యాల దగ్గర చిన్న పల్లెటూరికి తీసుకువెళ్ళారు. అక్కడ వ్యవసాయము చేస్తూ, ట్రాక్టరు నడుపుచూ ఉంటున్న సమయములో 1992వ సంవత్సరములో వివాహము జరిగినది. మా ఇరువురి కుటుంబములలోనూ దేవుడు తెలుసు కానీ, సరియైన విశ్వాసం లేక, బంధువులు ఎవరూ రారు అని హిందూ సాంప్రదాయములో వివాహం జరిగించారు. 1996వ సంవత్సరములో వ్యాపారం చెయ్యాలి అనే తలంపుతో నా కుటుంబము హైదరాబాద్‌కి వచ్చి దిల్‌షుక్‌నగర్‌లో ఉన్న ఒక చర్చికి వెళ్ళుచుండేవారము. అయినా నెమ్మది లేదు. దైవ మార్గములో సరిగా నడిపించువారు లేక ఆత్మీయంగా ఏ మాత్రం ఎదుగుదల లేదు. ఆ సమయంలో 1999వ సంవత్సరం ఏప్రియల్ నెలలో వేరొక చోటి నుండి వచ్చిన దైవజనుల వాక్యము ద్వారా రక్షణ పొందాలి అనే ఆశ కలిగి నేను, నా భార్య 04-04-1999లో రక్షణ పొందియున్నాము. అయినప్పటికీ ఎటువంటి ఎదుగుదల లేదు. 2008 నవంబర్‌లో నాకు నడుము నొప్పి వచ్చి, ఎన్ని హాస్పిటల్స్ తిరిగినా తగ్గలేదు. దానిని భరించలేని స్థితిలో మరణించాలని అనుకున్నాను. అప్పుడు నాకు పరిచయమైన ఒక సహోదరుని ద్వారా ఎపఫ్రా మినిస్ట్రీస్ భాగ్యలత కాలనీలో జరుగుచున్న శనివారము ఉపవాస ప్రార్థనలో పాల్గొని దైవజనులు ఎపఫ్రాగారితో ప్రార్థన చేయించుకున్నాను. నాకు స్వస్థత కలిగింది. అంత మాత్రమే కాకుండా హృదయమునకు స్పర్శ లేకుండా, విశ్వాసిగా,

 ప్రశంస పన్నీరు వంటిది. వాసన చూసి వదిలేయాలే తప్ప తాగుతూ కూర్చోకూడదు

సంఘ పెద్దగా జీవించుచున్న నన్ను కనికరించి నా ఆత్మీయ నేత్రములను తెరుచుకొనునట్లుగా కృపను చూపియున్నారు..

స్పర్శ ద్విమాస పత్రిక ప్రారంభించిన (2008 నవంబర్) నాటి నుండి నన్ను నా కుటుంబమును ఎపఫ్రా మినిస్ట్రీస్‌లో నిలిపి ఉంచారు. దైవసేవకులు మమ్ములను, పరిచర్యలో ఉన్న అనేకమందిని ప్రేమించే విధానమును చూచి వారివలెనే జీవించాలి అనే ఆశను పుట్టించారు. దైవజనులు బోధించుచున్న వాక్యమును ఆధారము చేసుకొని జీవించునట్లుగా సహాయం చేసారు. మాకు ఉన్న ధనాపేక్ష మరియు మా జీవితములలో జయించలేని అనేకమైన బలహీనతల నుండి విడిపించారు. మా ఇద్దరు పిల్లలు రక్షణ పొందునట్లు కృప చూపారు. ఆస్తులు సంపాదించాలి, ఈ లోకానుసారముగా ఆనందించాలి అని లేదు కాని నేను నా కుటుంబము దేవునిలో నిలిచి, ఆయన ప్రేమ కలిగి, అనేక మందికి ప్రయోజనకరంగా జీవించాలి అనేది తప్ప ఏ ఒక్కరికి అభ్యంతరకరంగా జీవించకూడదు అని మా యొక్క ఆశ. చివరి శ్వాస వరకు నన్ను, నా కుటుంబమును ఈ పరిచర్యలోనే దేవుడు నిలిపి ఉంచునట్లుగా మా కొరకు ప్రార్థించవలెనని కోరుకుంటున్నాము.

## ముఖ్య గమనిక:

**భాగ్యలత కాలని, వనస్థలిపురం**
**ప్రార్థనా మందిరము** నుందు జరుగు
**ఆదివారపు ఆరాధన** స్థలాభావం వలన
**హయత్‌నగర్ వర్డ్ అండ్ డీడ్ స్కూల్ ఛాపెల్**
**ఆడిటోరియంనకు మార్చడం జరిగినది.**

# ప్రేమించినవారు ప్రమాదంలో ఉంటే

తన కుమారుడు బాగా చదువుకోవాలని, గొప్పవాడు కావాలని ఎన్నో కలలు కని ఆ కుమారుణ్ని పట్టణము పంపించింది ఆ తల్లి, ఆ కుమారుడు పట్టణము వచ్చిన తర్వాత రెక్కలొచ్చిన పక్షివలె తాను కలిగియున్న స్వేచ్ఛను బట్టి తన ఇష్టానుసారముగా జీవించడం మొదలుపెట్టెను. తనకు అవసర మైనప్పుడెల్లా తల్లికి ఉత్తరం వ్రాయడం, డబ్బులు తెప్పించుకొని ఇష్టమొచ్చినట్టు తినడం, త్రాగడం. ఇది ఆ కుర్రాడి జీవిత విధానం. ఈ విధానంలోపడి చదువును, భవిష్యత్తును పూర్తిగా నాశనం చేసుకోవడం మొదలుపెట్టెను.

తన కొడుకు ఎలా ఉన్నాడో చూద్దాం! అని తల్లి తన కుమారునికి చెప్పకుండానే పట్టణములో చదువుకొనుచున్న కొడుకు కాలేజీకి వచ్చింది. కొడుకు ఏ హాస్టల్లో ఉంటాడో తెలుసుకుని, తాను అంత హఠాత్తుగా రావడాన్ని చూసిన కుమారుడు బహుగా సంతోషిస్తాడని గ్రహించి, ఎంతో సంతోషముతో ఎన్నో ఆలోచనలతో ఆ తల్లి కుమారుడు ఉండే గది తలుపు తెరిచింది. తన కళ్ళముందు కనిపించిన వాతావరణం చూచి నిర్ఘాంతపోయి కుప్పకూలిపోయే పరిస్థితి. అతని గది నిండా అర్ధనగ్నంగా వున్న అమ్మాయిల ఫోటోలు, గోడల నిండా బూతు సినిమా బొమ్మలు, వాటికి సంబంధించిన పుస్తకాలు, సిడీలు, డివీడీలు తాను రెక్కలు ముక్కలు చేసుకొని పైసా పైసా కూడబెట్టి, కొన్నిసార్లు తాను పస్తులుండి పంపిస్తున్న ఆ డబ్బులు, ఇటువంటి చెడ్డపనుల కొరకా? నా కొడుకు వాడుతుంది? ఇటువంటి చెడిపోయిన కొడుకు కోసమా నేను కలలు కంటుంది! అయ్యో! అయ్యో! అని ఏడ్చింది. గుండెలు బాదుకుంది. సాయంత్రమయ్యేసరికి కుమారుడు రానే వచ్చాడు. తన గదిలో ఉన్న తల్లిని చూసి హడలిపోయాడు. ప్రేమగల ఆ తల్లి ఏమీ మాట్లాడలేదు. అతన్ని సరిచేయలేదు.

తరువాత తన కుమారునితో మాట్లాడుతూ ... నాయనా! నేనంటే నీకు ఇష్టమేనా? అని అతని కళ్ళలోకి కళ్ళుపెట్టి చూస్తూ ప్రశ్నించింది. యౌవనేచ్ఛల్లోపడి పాడైపోయిన ఆ కుర్రాడ్ని తల్లి అలా అడిగేసరికి నోటమాట రాలేదు. ఏం నాయనా! మాట్లాడవే? నేనంటే నీకిష్టమేనా? అందుకు బొంగురుపోయిన గొంతుతో 'అమ్మా నువ్వంటే నాకు ప్రాణమమ్మా' అని ఆ కుమారుడు బదులిచ్చెను. అయితే ఈ ఫోటోను ఈ గోడమీద నుండి ఎన్నడూ తీసివేయొద్దు అని యేసయ్య చిత్రపటాన్ని అర్ధనగ్నంగా ఉన్న అమ్మాయిల బొమ్మల మధ్య ఆ గోడపై అంటించి, కుమారుని కొరకు ప్రార్థించి తల్లి వెళ్ళిపోయింది.

ఉదయం లేచిన వెంటనే యేసయ్య ఫోటో అర్ధనగ్నంగా వున్న అమ్మాయిల మధ్య వుండడం సహించలేక ఆ ఫోటో చుట్టూవున్న అర్ధనగ్న బొమ్మలన్నిటినీ చించేసాడు. అయినా

కొన్ని పోకిరి ఫోజులిచ్చిన కుర్రాళ్ళ బొమ్మలు, హీరోల బొమ్మలు ఇవన్నీ యేసయ్య ప్రక్కన ఉండటం చూడలేక పోయాడు. ఆ గోడమీద బొమ్మలన్నీ చించేసాడు. ఆ ఫోటోలో నుండి యేసయ్య అక్కడ వున్న బూతు సినిమాలు, డివిడీలను చూస్తున్నట్టుగా అనిపించింది. ఛీ! ఛీ! అనుకుని తన గదిలో నుండి తీసి పడేసాడు. అయినా తృప్తి చెందని ఆ కుర్రాడు తన గదినంతా శుభ్రం చేసి, నా యేసయ్య వున్న గదిలో పాపానికి చోటివ్వకూడదని తలంచి తనసుతాను సరిచేసుకొనెను.

ప్రియ చదువరీ! యేసయ్య ఫోటో గదిలో ఉంటేనే మార్పు కలిగిస్తే, మరి నువ్వూ, నేను క్రీస్తుని రక్షకునిగా హృదయంలో అంగీకరిస్తే మన హృదయాలు ఏ విధంగా ఉన్నాయి? రక్షించబడిన మనము దేవునికి భయపడుచున్నామా? ఆయన చూస్తున్నట్టుగా నడుచుకుంటున్నామా? మన ఆలోచనలు, తలంపులు ఏ విధంగా ఉన్నాయి? మన ఆలోచనలు బాల్యం నుండి చెడ్డవే. హృదయం చెడిపోయినప్పుడు శరీరం మీద ప్రభావం చూపుతాయి. (మార్కు 7:20,21,22) సాతాను నీకు బోధిస్తాడు, పాపం నీ కోరిక తీర్చుతుంది. తర్వాత దాని కోరిక తీర్చుకుంటుంది. ఈ విధంగా మనము సాతాను నడిపింపుకు లోబడిపోతే దేవునికి భయపడినవారమౌతామా?

క్రీస్తు నందు ప్రియమైన వారలారా! అమూల్యమైన రక్తముచేత కడగబడిన మనము ఏ విధంగా జీవించాలి? మన హృదయంలో దేవుని చేర్చుకున్నవారముగా ఆయనకి ప్రియమైన పిల్లలుగా ఉంటే ఎంత ఆనందం. ఒక కన్న తల్లి ప్రేమే చూశాము కదా! తన కుమారుని కొరకు ఎంతగా గుండెలు బాదుకుందో! నేటి యువత చదువును, భవిష్యత్తును పట్టించుకోక పాపము చేయాలని తపన కలిగియున్నారు. కీర్తన 107:17,18 . ఈ రోజుల్లో స్త్రీ పురుష బేధం లేకుండా స్వేచ్ఛా స్వాతంత్ర్యములు కలిగి దుష్కామ ప్రవర్తనతో సమాజం భ్రష్టుపట్టిపోయింది. మనుషుల్లో స్వార్థం పెరిగిపోయింది. ఎదుటివారు ఎలా ఉన్నా పట్టించుకోని పరిస్థితులు తాను మాత్రం సంతోషంగా ఉండాలనే తాపత్రాయం మాత్రమే కనబడుతుంది. క్రీస్తు మన హృదయాల్లో ఉంటే ఆ విధంగా ఉండగలమా! దేవుని సంతోషపెట్టాలని, ఆయన చూస్తున్నాడని మన కొరకు సిలువను భరించాడు అని జ్ఞాపకం ఉంచుకుంటే మన ప్రవర్తన అంతటి మీద ఆయన అధికారానికి ఒప్పుకుంటాము. అట్టి తీర్మానంతో జీవిద్దాము...

# ప్రార్థనా శక్తి

ప్రార్థన యొక్క శక్తి క్రొత్తదేమీ కాదు, బైబిల్‌లో దీనిని గూర్చిన అనేక గొప్ప కథనాలను మనం కనుగొంటాము. దేవునికి ప్రార్థిస్తూ, యిర్మీయా **"నీకు అసాధ్యమైనదేదియు లేదు"** అని సరిగ్గానే ప్రార్థించాడు. (యిర్మీయా 32:17) పాత క్రొత్త నిబంధనలు రెండింటిలో అసాధ్యమైనదేది లేని దేవునికి ప్రజలు ప్రార్థించినప్పుడు ఆయన అద్భుతకరమైన మార్గములలో వారికి జవాబుని ఇచ్చాడు.

### హన్నా

నిరాశతోనున్న పిల్లలు లేని ఒక గొడ్రాలైన స్త్రీ. ఈ దినాలలో అభివృద్ధి చెందిన వైద్యశాస్త్రజ్ఞానం ఇటువంటివారికి చాలా సహాయం చేస్తుంది. అయితే పాత నిబంధనా దినాలలో ఏ వైద్యశాస్త్రజ్ఞానం అందుబాటులో లేదు. గొడ్రాలైన స్త్రీకి ఏ విధమైన నిరీక్షణ ఉండదు. కొన్ని సంవత్సరాలుగా ప్రపంచంలో అన్నింటికంటే ఎక్కువగా హన్నా ఒక బిడ్డను కోరుకుంది. ఆమె దేవుని ప్రార్థించి అసాధ్యాన్ని చేయమని అడిగే రోజు వచ్చింది. అన్నిటికీ భిన్నంగా, సమూయేలు జన్మించి, ఇశ్రాయేలులో గొప్ప ప్రవక్త మరియు యాజకుడైనాడు.

### ఎలీషా

చనిపోయిన వారిలో జీవాన్ని తేగలిగింది దేవుని శక్తి ఒక్కటే. 2 రాజులు 4:8-36 లో ఏలీషా ప్రవక్త ఆయన ప్రయాణంలో దయచూపించిన 'షూనేమీయురాలైన" ఒక స్త్రీ గూర్చి మాత్రమే చెప్పబడింది. ఆమె, ఆమె భర్త ఒక నిర్ధిష్ట సమయంలో ఒక మగపిల్లవానిని కలిగివుంటారని ఎలీషా ప్రవచించాడు. అలాగే జరిగింది. అయితే, చాలా సంవత్సరాల తరువాత, ఆ చిన్నవాడు చనిపోయినపుడు ఆమె ఎలీషాను పిలిచినది. ఎలీషా వచ్చినపుడు ఆ చిన్నవాడు చనిపోయాడని తెలుసుకున్నాడు. ఆ చిన్నవాని గదిలోనికి వెళ్ళి తలుపు మూసి **"ప్రభువునకు ప్రార్థించెను"** (2 రాజులు 4:33). మొదట, ఆ చిన్నవాని శరీరం వేడెక్కినది, తరువాత వాడు 7 సార్లు తుమ్మి, తన కళ్లు తెరిచాడు.

### హిజ్కియా

ప్రవక్తయైన యెషయా దేవుని వద్దనుండి ఒక సందేశంతో, పాత నిబంధన రాజు హిజ్కియాను కలిసినపుడు, అతడు రోగియై, చావనైయున్నాడు. "నీవు మరణమవుచున్నావు, బ్రదుకవు గనుక నీవు నీ యిల్లు చక్కబెట్టుకొనుమని యెహోవా సెలవిచ్చుచున్నాడని - చెప్పగా" (2


రాజులు 20:1). అయితే, హిజ్కియా బ్రతకాలని ఆశించాడు. కాబట్టి, అతను వెంటనే కన్నీరు కార్చుతు, పట్టుదల కలిగి ఈ విధంగా ప్రార్థించాడు. "యెహోవా, యథార్థహృదయుడనై, సత్యముతో నీ సన్నిధిని నేనెట్లు నడుచుకొంటినో, నీ దృష్టికి అనుకూలముగా సమస్తమును నేనెట్లు జరిగించితినో, కృపతో జ్ఞాపకము చేసికొనుము". యెషయా నడిమిశాలలో నుండి అవతలకు వెళ్లకమునుపే, దేవుడు అతనితో మరల మాట్లాడి, హిజ్కియా వద్దకు మరల వెళ్లి ఈ విధంగా చెప్పమన్నాడు. **"యెహోవా నీకు సెలవిచ్చునదేమనగా నీవు కన్నీళ్ళు విడుచుట చూచితిని నీ ప్రార్థన నేనంగీకరించియున్నాను నేను నిన్ను బాగుచేసెదను". (2 రాజులు 20:5).** హిజ్కియా ప్రార్థన శక్తి కలిగివున్నది. దేవుడు అతనిని కేవలం బాగుచేయటమే కాదు కాని అతనికి 15 సంవత్సరముల ఆయుష్షను ఇచ్చియున్నాడు.

## జెకర్యా

పాత నిబంధనలోని అబ్రహాము, శారాలవలెనే, నూతన నిబంధనలో పిల్లలు లేని (పుట్టుటకు సాధ్యం కాని) వృద్ధ దంపతులు వున్నారు. నేను వైద్యశాస్త్రపరంగా పిల్లలు పుట్టుట అసాధ్యమైన వారి గురించి మాట్లాడుతున్నాను. అయితే, ప్రార్థన శక్తివంతమైనదని మనం గుర్తు చేసుకోవాలి. తన భార్య, ఎలిజబెత్ బిడ్డను కనాలని కోరిన యాజకుడైన జెకర్యాను దూత దర్శించి **"జెకర్యా భయపడకుము నీ ప్రార్థన వినబడినది, నీ భార్యయైన ఎలీసబెతు నీకు కుమారుని కనును, అతనికి యోహాను అని పేరు పెట్టుదువు" (లూకా 1:13)**అని చెప్పినది. తన తల్లిదండ్రుల ప్రార్థనా ఫలితంగా జన్మించిన ఈ అద్భుతమైన బిడ్డ, యేసు రాకను ముందుగా ప్రకటించిన బాప్తిస్మమిచ్చు యోహానుయే.

అందరూ మనవలె మామూలు మనుష్యులు. వారి పరిస్థితుల వలె మన పరిస్థితులు నిజమైనవి. అధిగమించలేని ఆటంకముల వలె కనిపించు పరిస్థితుల మధ్యలో ప్రార్థనాశక్తి వారి జీవితములలో మార్పు కలుగజేసింది. మన జీవితములో కూడా మార్పు కలుగజేస్తుంది. ప్రార్థన అనేది మన జీవితములలోని పరిస్థితులు భరించునట్లుగా దేవుని శక్తిని కలుగజేస్తుంది. దేవుని యొక్క శక్తి ఒక పరిస్థితిని తాకినప్పుడు, అది తప్పకుండా మారుతుంది. మరియు దేవుడు పక్షపాతి కాదని, వారి ప్రార్థనలకు ఎంత సామర్థ్యంగా ప్రవర్తించి, శక్తివంతముగా స్పందించాడో, మన జీవితములలో కూడా అలానే చేయుటకు ఇష్టపడుతున్నాడు, సమర్థుడైయున్నాడు.


# ఆకోరు లోయ
## (ప్రలాపముల లోయ)



శపితమైన దాని విషయములో ఇశ్రాయేలీయులు తిరుగుబాటు చేసిరి. ఎట్లనగా యూదాగోత్రములో జెరహు మునిమనుమడును జబ్ది మనుమడును కర్మీకుమారుడునైన ఆకాను శపితము చేయబడిన దానిలో కొంత తీసికొనెను గనుక యెహోవా ఇశ్రాయేలీయుల మీద కోపించెను. చిన్నదైన హాయి అను పట్టణమును జయించలేకపోయిరి. కారణం ఆకాను దోపుడు సొమ్ములో ఒక మంచి షీనారు పైవస్త్రమును రెండువందల తులముల వెండిని, 50 తులముల యెత్తు గల ఒక బంగారు కమ్మిని చూచి వాటిని ఆశించి తీసికొని, ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవాకు విరోధముగా పాపము చేసెను.

తరువాత ఇశ్రాయేలీయులందరు ఆకానును, ఆ వెండిని, పైవస్త్రమును ఆ బంగారు కమ్మిని, ఆకాను కుమారులను, కుమార్తెలను, ఎద్దులను, గాడిదలను, మందను, డేరాను, వానికి కలిగిన సమస్తమును పట్టుకొని ఆకోరు లోయలోనికి తీసుకొని వచ్చిరి. వారిని రాళ్ళతో చావగొట్టిరి. తరువాత అగ్ని చేత కాల్చి, వారి మీద రాళ్ళను పెద్ద కుప్పగా వేసిరి. అది నేటి వరకు ఉన్నది. అప్పుడు యెహోవా కోపోద్రేకము విడిచినవాడై మళ్ళుకొనెను. అందుచేత నేటివరకు ఆ చోటికి ఆకోరు లోయ అనగా బాధలోయ అని పేరు.

ఇది యూదా బెన్యామీను గోత్ర భూములకు మధ్యనున్న ఒక లోయ. అది పశువులు పరుండు ఫలవంతమైన భూప్రదేశమగునని యెషయా ప్రవక్త ప్రవచించెను. హోషేయ 2:15లో నున్న శ్రమగల లోయ యనునది ఆకోరు లోయగా చెప్పబడినది.




# బైబిల్ క్విజ్ -26

(యోహాను పత్రికల నుండి ఇవ్వబడినవి)

**ఈ క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాయండి.**

**1.** **దేవుని మూలముగా పుట్టినవారు ఏమి చేయుట వలన దుష్టుడు వారిని ముట్టడు?**

**2.** **సంఘములో ప్రధానత్వమును కోరుకున్నది ఎవరు?**

**3.** **ఒక స్త్రీకి, పిల్లలకు వ్రాయబడిన పత్రిక ఏది?**

**4.** **మన కొరకు తండ్రి యొద్ద ఉన్న ఉత్తరవాది ఎవరు?**

**5.** **అందరి వలన మరియు సత్యం వలన కూడా మంచి సాక్ష్యం పొందినది ఎవరు?**

**6.** **తండ్రిని, కుమారుడిని ఒప్పుకొనని వాడు ఎవడు?**

**7.** **నీళ్ళ ద్వారాను, రక్తము ద్వారాను వచ్చిన వాడు ఎవరు?**

**8.** **క్రీస్తు బోధ యందు నిలిచియుండక, దానిని విడిచి ముందుకు సాగు ప్రతివాడు ఎవరిని అంగీకరింపని వాడు?**

**9.** **'వాడు దుష్టుని సంబంధి' అని ఎవరి గురించి చెప్పబడినది?**

**10.** **లోకమును జయించిన విజయము ఏమిటి?**

ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు ఫిబ్రవరి 15వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు మార్చి 2013 పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా :- ఎడిటర్ – స్పర్శ,** ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ – 500 070.

**<u>బైబిల్ క్విజ్ – 25 జవాబులు (పేతురు పత్రికనుండి ఇవ్వబడినవి) :</u>**

**1**. ఆమెయు, మార్కును వందనములు చెప్పుచున్నారు, 1 పేతురు 5:13

**2**. తమ స్వపురుషులకు లోబడియుండుటచేత, 1 పేతురు 3:5

**3.** మందకు మాదిరులుగా ఉండుడి, 1 పేతురు 5:1-4

**4.** పౌలును, 2పేతురు 3:15,16

**5.** దేవుని మహిమపరచవలెను, 1 పేతురు 4:16

**6.** ప్రభువైన యేసుక్రీస్తు, 2 పేతురు 1:13,14

**7.** బహుమంచిది, 1 పేతురు 3:18

**8.** స్థిరమైన ప్రవచన వాక్యము, 2 పేతురు 1:19

**9.** శరీరమందు, 1 పేతురు 4:1

**10.** నోరులేని గార్ధభము మానవస్వరముతో మాటలాడి, 2 పేతురు 2:16

**<u>బైబిల్ క్విజ్ – 25 ప్రశ్నలకు సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేర్లు :</u>**

పూజిత, హైమావతి, ఐజాక్‌కుమారి, దివ్య, షీబారాణి, సౌజన్య, చింతయ్య (రామాపురం)

# ఎపఫ్రా మినిస్ట్రీస్

## 2013 ప్రత్యేక ఉపవాస ప్రార్థనా కూడికలు

| నెల | తేది | వారం | సమయం (ఉదయం) | స్థలం (మందిరం) |
|---|---|---|---|---|
| జనవరి | 26 | శని | 9.00 | భాగ్యలత |
| మార్చి | 29 | శుక్ర | 9.00 | భాగ్యలత, అనాజ్‌పూర్, చింతల్ |
| మే | 01 | బుధ | 9.00 | భాగ్యలత |
| ఆగష్టు | 15 | గురు | 9.00 | భాగ్యలత |
| అక్టోబర్ | 02 | బుధ | 9.00 | భాగ్యలత |

**యౌవనస్థుల కూడికలు:-**

ప్రతి నెల 2వ బుధవారం రాత్రి గం.7.00 లకు - భాగ్యలత

ప్రతి నెల 3వ ఆదివారం సాయంత్రం గం.5.00 లకు - చింతల్

**స్త్రీల కూడికలు:-**

ప్రతి నెల 1వ బుధవారం రాత్రి గం.7.00 లకు - భాగ్యలత

ప్రతి నెల 2వ బుధవారం రాత్రి గం.7.00 లకు - చింతల్

**సేవకుల కూడిక:-**

ప్రతి నెల 4వ బుధవారం రాత్రి గం.7.00 లకు - భాగ్యలత

**"ఆయన నిన్ను విడువడు, నిన్ను ఎడబాయడు. - ద్వితీ 31:8"**

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## జనవరి – ఫిబ్రవరి

**భాగ్యలత** : చైత్రిక, హరికుమార్, సులోచనారాణి, రంగా, మణి, రమాదేవి, కుమారి, క్రాంతికృష్ణ, పాల్‌ప్రవీణ్, దీవెన, నిర్మల, తిరుమల, హైమావతి, రాజ్‌కుమార్, సజీవ్, కృపాలత, సత్య, రాజేష్, రగూయేలు, మంజుల, జోసెఫ్, పూజిత, తిమోతి, నిహారిక, తులసి, జ్యోత్స్న, కరుణాకర్‌రాజు, శ్రీనివాస్, సునీత, చల్లారావు, మనోహర్, దివ్య, రాజ్‌కుమార్, లత, స్నేహలత, ఆనందరావు, కొర్నేలి, మేరీసౌజన్య

**చింతల్** : కొర్నేలి, ప్రకాశ్, సజీవ్, శ్రావణి, సునీత, జయరాజు, రాహుల్, జ్యోతిర్మయి, పుష్పలత, జెఫ్రీరోజ్‌రాయ్, ఉదయ్, రిబ్కా, జె.యస్.ఎన్.మూర్తి, పవన్‌చందు, దానియేల్, హెప్సిబా, అమర్, సువర్ణరాజు,మహిమజ్యోతి, కీర్తన, స్పందన, నాగరాజు, దుర్గావెంకటలక్ష్మి, నాగవెంకటలక్ష్మి

**అనాజ్‌పూర్** : విజయమ్మ, వైకుంఠరావు, హనోకు, అంకమ్మ, సువమ్మ, సునీత, కీర్తి, మరియ, అమర్‌నాథ్, జాన్‌బీ

**ఇ.సి.ఐ.యల్** : జీవా, సజీవ్, సరోజిని, లలిత, హృదయ

**"స్పర్శ"** అనే మన ద్వీమాస పత్రిక సంవత్సర చందా రూ. 100/- లు, జీవితకాల చందా రూ. 2000/- లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 40.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ______________________________

2. చిరునామా: ______________________________

______________________________

______________________________

పిన్ కోడ్: ______________________________

మీ ప్రార్థనావసరతలు:

______________________________

______________________________

______________________________

______________________________

మా చిరునామా:
**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం. 1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-70, ఫోన్: 040-2420 2227

డిసెంబర్ 25, 2012 క్రిస్మస్ ఆరాధనలో వేలాదిగా పాల్గొని దేవునిని
ఆరాధించి, ఆశీర్వాదము పొందుకొనడం జరిగినది.







డిసెంబర్ 31, 2012 జరిగిన వాచ్ నైట్ సర్వీసును మరియు జనవరి 1, 2013 న
నూతన సంవత్సర ఆరాధనను దేవుడు ఎంతో ఆశీర్వాదకరంగా జరిగించారు.





# ఎపఫ్రా మినిస్ట్రీస్


ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com | web: www.epaphra.org